గడబిడల గులాబీ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాయకుల మధ్య ఆధిపత్య పోరు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భారత రాష్ట్ర సమితి పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. ముఖ్య నాయకులు ఆధిపత్య పోరులో మునిగిపోవడం అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది. ముఖ్యంగా వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, భూపాలపల్లి నియోజకవర్గాల్లో నాయకులు ఎవరికి వారే యమునాతీరే అనే చందంగా తయారయ్యారు. నియోజకవర్గాల పునర్విభజనపై ఆశలు పెట్టుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. ఇప్పటి నుంచే వర్ధన్నపేట నియోజకవర్గంపై దృష్టి సారించారు. పునర్విభజనలో జనరల్ స్థానం అవుతుందని, తాను ఇక్కడి నుంచే పోటీ చేస్తానని చెబుతున్నారు. దీంతో వర్ధన్నపేట ఇన్‌చార్జ్ పదవికి ప్రాముఖ్యత ఏర్పడింది. కాగా, దీనిని ఏనుగుల రాకేష్‌రెడ్డికి ఇవ్వాలని జనగామ ఎమ్మెల్యే పల్లా పట్టుబడుతుండగా, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డికి ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ అంశం ఎర్రబెల్లికి కంటకంగా మారింది. ఇదిలా వుండగా, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు పడుతుందనే ఆశలో గులాబీ నేతలు ఉన్నారు. దీంతో ఇప్పటి నుంచే ఆ స్థానం ఎలాగైనా దక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన స్థానికుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను పార్టీలో చేర్చుకోవాలని ప్రతిపాదిస్తున్నారు. ఈ విషయాన్ని గులాబీ బాస్ ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. అలాగే భూపాలపల్లి నియోజకవర్గంలో సిరికొండ - గండ్ర మధ్య వార్ నడుస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ హోదాలో నియోజకవర్గంలో పర్యటిస్తున్న మధుసూదనాచారిపై వెంకటరమణారెడ్డి గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో పార్టీ నేతలు వ్యవహరిస్తున్న తీరుపై అధిష్ఠానం అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ రజతోత్సవ సభ ఎలా నిర్వహించాలని సంశయంలో పడింది. ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని ఎల్కతుర్తిని సభకు ఎంపిక చేసిందని, ఆ జిల్లా నాయకులకే పార్టీ అధిష్ఠానం నిర్వహణ బాధ్యతలు అప్పగించిందని ప్రచారం జరుగుతోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



- పార్టీ నిర్ణయాల్లో పట్టుకోసం ఎత్తుకు పైఎత్తులు
- వర్ధన్నపేటపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కన్ను
- 'ఇన్‌చార్జ్' పదవి కోసం పెరుగుతున్న పోటీ
- రాకేష్‌రెడ్డి లేదా పోచంపల్లికి ఇవ్వాలని ప్రతిపాదనలు
- 'స్టేషన్'లో ఉప ఎన్నికలకు ఇప్పటి నుంచే కార్యాచరణ
- అరూరి రమేష్‌ను పార్టీలో చేర్చుకోవాలని ఒత్తిడి
- భూపాలపల్లిలో సిరికొండపై గండ్ర గరం గరం
- నియోజకవర్గంలో పర్యటనలు చేయడంపై గుర్రు
- నేతల సమన్వయ లోపంపై అధిష్ఠానం అసంతృప్తి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలకు 'రజతోత్సవ' బాధ్యతలు

7

ఎస్ఎస్ఏల క్రమబద్ధీకరణ 'సాకారమయ్యేనా'?!


మెదక్ జిల్లా చేగుంట మండలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీలు రమేష్, శ్రీనివాస్ కుటుంబాలకు రూ. 12 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను అందజేస్తున్న డీఈవో రాధాకిషన్(ఫైల్)

- విధి నిర్వహణలో అసువులుబాస్తున్న చిరుద్యోగులు
- ప్రభుత్వం నుంచి ఉద్యోగభద్రత, ఎక్స్‌గ్రేషియా కరువు
- ఇన్సూరెన్సు కంపెనీల్లో పాలసీలు తీసుకుంటున్నవైనం
- సీఎం ఇచ్చిన హామీ నెరవేరుస్తారని ఎదురుచూపు
- సమగ్రశిక్ష ఉద్యోగులకు రూ.20 వేలలోపే వేతనాలు
- పనిభారంతో సతమతమవుతున్న సిబ్బంది
- రాష్ట్ర వ్యాప్తంగా 19,500 మంది నిరీక్షణ

మహబూబాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ సమగ్రశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల క్రమబద్ధీకరణ కల సాకారమయ్యేనా..? రెగ్యులర్ అవడం దేవుడెరుగు కానీ, అప్పటి వరకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమానపనికి సమాన వేతనమైనా అమలు చేయాలని విన్నవిస్తున్నారు. పేస్కేలు అమలు చేసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలుమార్లు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో 2023 సెప్టెంబరు, 2024 డిసెంబరు నెలల్లో రాష్ట్ర వ్యాప్తం గా జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు చేపట్టారు. సమగ్రశిక్షలో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీ (క్లస్టర్ రిసోర్స్ పర్సన్)లు, ఎంఐఎస్ (మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం) కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) ఎస్‌వో(ప్రత్యేక అధికారులు) సీఆర్టీలు, ఐఈఆర్పీ (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్)లు, పీటీఐ, (పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు) అకౌంటెంట్లు, మెసెంజర్లు, బోధనేతర సిబ్బంది 19,500 మంది విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులు మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురై రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాతపడుతున్నారు. విధి నిర్వహణలో మృతి చెందుతున్న ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఎక్స్‌గ్రేషియా అందించకపోవడం బాధకరం. మృతి చెందిన ఉద్యోగులకు తోటి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆర్థిక సాయం చేసి వారి కుటుంబాలను ఆదుకునే దుస్థితి నెలకొంది. ఈ ఏడాది ఫిబ్రవరి 14న మెదక్ జిల్లా చేగుంట మండలంలో సీఆర్పీలుగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌నాయక్, శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఇరువురి కుటుంబాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ద్వారా సమకూర్చిన రూ.12లక్షలను జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ చేతుల మీదుగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి సదరు బాండ్‌లను ఆ కుటుంబాలకు అందించారు.


2023 సెప్టెంబరు 13న సమ్మె శిబిరంలో టీపీసీసీ అధ్యక్షుడిగా మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్న ఉద్యోగులు..

చాలీచాలని వేతనాలతో ఒకవైపు బతుకుబండిని లాగిస్తున్న ఉద్యోగులు మరో వైపు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతుండగా, వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. సర్కారు కొలువు అని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సమయపాలన పాటిస్తూ.. విధులు నిర్వహిస్తున్నా వచ్చే వేతనాలతో కనీస అవసరాలు తీరక ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ మానసికంగా కుంగిపోతున్నారు. పనిఒత్తిడితో సతమతమవుతూ బైక్‌లపై వెలుతూ

మిగతా 8వ పేజీలో...

జిల్లాలో 545 మంది ఉద్యోగులు

మహబూబాబాద్ జిల్లాలో సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)లో కాంట్రాక్ట్ పద్ధతిలో 545 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం (డీఈవో)లో-5 గురు, మండల విద్యావనరుల కేంద్రాల్లో (ఎమ్మార్సీ) ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు-18, కంప్యూటర్ ఆపరేటర్లు- 12, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు-75, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్సు టీచర్లు (ఐఈఆర్పీ)లు-21, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రత్యేకాధికారులు, సీఆర్టీలు- 334, పార్ట్‌టైం టీచర్లు (పీటీఐ)లు-59, మెసెంజర్లు-14, కేర్‌గీవర్లు- 6 మొత్తం 545 మంది విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సర్వశిక్షా అభియాన్ వివిధ విభాగాల్లో సుమారు 2 వేల మంది విధులు నిర్వహిస్తున్నారు.

టైంస్కేల్ అమలు చేస్తూ క్రమబద్ధీకరించాలి : మహంకాళి వీరన్న, ఎస్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు, మానుకోట



పద్దెనిమిదేళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు టైంస్కేల్ అమలు చేస్తూ క్రమబద్ధీకరించాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పాఠశాల స్థాయికి తీసుకెళ్తూ బడుల బలోపేతానికి కృషి చేస్తున్నాం. మండల విద్యాశాఖాధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ప్రధానోపాధ్యాయులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అడిగిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నాం.

ఎట్టకేలకు దేవాదుల మోటార్లు ప్రారంభం

- దేవన్నపేట ఫేజ్-3 పంప్‌హౌస్ మోటార్లు ఆన్‌చేసిన మంత్రులు
- పాల్గొన్న ఉత్తమ్, పొంగులేని, ఎమ్మెల్యేలు కడియం నాగరాజు, యశస్విని
- ఊపిరి పీల్చుకున్న మంత్రులు, అధికారులు

7


దేవన్నపేటలో దేవాదుల నీటికి పూజలు చేస్తున్న మంత్రులు

'ఆరోగ్యలక్ష్మీ'కి సుస్తీ


పథకం అమలుపై నీలినీడలు

- సకాలంలో అందని పౌష్టికాహారం
- పక్కదారి పడుతున్న ప్రభుత్వ లక్ష్యం
- జిల్లాలో 1,437 అంగన్‌వాడీ కేంద్రాలు

6

రాము ఇచ్చిన ఉద్యమ స్ఫూర్తితోనే..

- ఉద్యమకారిణిగా, మంత్రిగా ప్రజాసేవ చేస్తున్నా..
- ఎర్రజెండా నుంచి అకు పచ్చజెండా వరకు రాము ప్రస్థానం
- పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క
- మోకాలపల్లిలో భావోద్వేగంగా కుంజ రాము వర్ధంతి
- కన్నీటి పర్యంతమైన మంత్రి సీతక్క కుమారుడు సూర్యరామ్


కుంజ రాము స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సీతక్క

కన్నీరు కార్చుతున్న మంత్రి సీతక్క, కుమారుడు సూర్యరామ్

కొత్తగూడ, మార్చి2 (ఆంధ్రజ్యోతి): నాడు కుంజ రాము నేర్పిన ఉద్యమ స్ఫూర్తితో నాడు ఉద్యమంలో, నేడు రాజకీయాల్లో ప్రజాసేవ చేస్తున్నానని, అందరూ బాగుండాలనేది రాము కోరిక అని పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మోకాళ్లపల్లిలో కుంజ రాము వర్ధంతిని గురువారం నిర్వహించారు. ముందుగా రాము ఎగురవేసిన ఏఎల్‌టీ జెండాను కుమారులు సూర్యరామ్, రాహుల్ రామ్, కోడలు కుసుమాంజలి తీసుకువచ్చి కుంజ రాము స్థూపంవద్ద ప్రతిష్ఠించారు. అనంతరం స్థూపం వద్ద మంత్రి సీతక్క, అరుణోదయ కళాకారురాలు విమలక్క, కుంజ రాము కుమారులు, నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం కుంజ శ్రీను అధ్యక్షతన నిర్వహించిన స్మారక సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 15ఏళ్ల వయస్సులోనే రాము ఉద్యమాల పట్ల అసక్తితో విప్లవం బాట పట్టారని పేర్కొన్నారు. నాటి నుంచి ఆదివాసీ, బడుగు, బలహీన వర్గాల పేదల కోసం పరితపించారని పేర్కొన్నారు. ప్రజల కష్టాలు తీర్చేందుకు పోరాడాలని, ప్రజల కోసం మరణించాలని రాము హితబోధచేసేవాడని పేర్కొన్నారు. ఎర్రజెండా పట్టుకుని ఉద్యమ బాట పట్టిన రాము ఆదివాసీల కోసం పచ్చ జెండా పట్టి ఉద్యమంలో మరణించాడని పేర్కొన్నారు. రాము నేర్పిన నైతిక విలువలు, నాడు నేర్చుకున్న స్ఫూర్తితోనే నేడు వేదిక వేరే అయినా ప్రజలను గౌరవించడం, వారి కష్టాలు తెలుసుకుని వారి కోసం పని చేయడం చేస్తున్నానని వివరించారు. ఆదివాసీల, దళితుల, బీసీ, ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అందరి హక్కులు అమలయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఆదివాసీలకు న్యాయం జరిగినాడే నిజమైన నివాళి

ఆదివాసీలు లేకపోతే అడవి లేదని, ఆదివాసీలకు అడవి అడవి దక్కిన నాడు, న్యాయం జరిగిన నాడే కుంజ రాముకు నిజమైన నివాళి అని అరుణోదయ సంస్కృతి సమాఖ్య కన్వీనర్ విమలక్క పేర్కొన్నారు. విప్లవ పోరాటాలన్ని, విప్లవ కారులంతా ఎకతాటిపైకి రావాలని పేర్కొన్నారు. ప్రజలను గెలిపించే పోరాటాలు రావాలని పిలుపునిచ్చారు. అడవుల్లోని ఖనిజ సంపద దోచుకోవాటానికి కొందరు చూస్తున్నారని పేర్కొన్నారు. వారిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

నాన్న ఆశయాలు సాధిస్తా..

తన తండ్రి కుంజ రాము ఉద్యమ స్ఫూర్తితో ఆశయాలను సాధిస్తానని కుంజ సూర్యరామ్ పేర్కొన్నారు. కాగా, విమలక్క పాట పాడుతుండగా మంత్రి సీతక్క, సూర్యరామ్, కన్నీటి పర్యతం అయ్యారు.

'ఆరోగ్యలక్ష్మి'కి సుస్తీ

• సకాలంలో అందని పౌష్టికాహారం • పక్కదారి పడుతున్న ప్రభుత్వ లక్ష్యం • జిల్లాలో 1,437 అంగన్‌వాడీ కేంద్రాలు

నర్సింహులపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : 'ఆరోగ్యలక్ష్మి పథకం అమలుపై నీలినీడలు అలుముకున్నా యి. మాతా శిశు మరణాలను తగ్గించి, బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో 2014లో ఈ స్కీంను సర్కారు ప్రారంభించింది. ప్రభుత్వం నుంచి నెలసరి అందాల్సిన పౌష్టికాహారం వారికి సకాలంలో అందడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్, మరిపెడ, డోర్నకల్, గూడూరు, తొర్రూరు ప్రాజెక్టుల పరిధిలో 1437 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో గర్భిణులు 3,890, 0-6 నెలల చిన్నారులు 3,318, బాలింతలు 3,609 మంది, 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 19,593, మూడు సంవత్సరాల నుంచి 6 సంవత్సరాలలోపు చిన్నారులు 16,257 మంది ఉన్నారు.

ఈ పథకంలో అంగన్‌వాడీ సెంటర్లకు పాలు, కోడిగుడ్లు, పప్పు, వంటనూనె, బియ్యం, బాలామృతం, స్నాక్స్ (మంచిశెనగలు, ఒడియాలు) ప్రతీనెల సరఫరా చేయాల్సి ఉన్నది. కేవలం పాలు, కోడిగుడ్లు, బియ్యం, అరకొరగా బాలామృతం ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. పప్పు, వంటనూనె, స్నాక్స్ ఆరునెలల నుంచి అందటం లేదని పలువురు బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఏడుకు బదులుగా.. మూడు సరుకులే..

ప్రతీ అంగన్‌వాడీ సెంటర్‌కు ప్రభుత్వం నుంచి పాలు, కోడిగుడ్లు, వంటనూనె, పప్పు, బియ్యం, బాలామృతం, స్నాక్స్ నెలనెల సరఫరా చేయాల్సిన సరుకులు. కానీ, గత ఆరుమాసాల నుంచి వంటనూనె, స్నాక్స్ సరఫరా నిలిపివేశారు. మూడునెలల నుంచి బాలామృతం, పప్పురావడం లేదు. కేవలం మూడుసరుకులు మాత్రమే అందుతున్నాయి.

నీరుగారిపోతున్న సర్కారు లక్ష్యం..

గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అం దించి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా 2014 జనవరి మాస ంలో అప్పటి ప్రభుత్వం 'అమృతహస్తం' పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం క్రమేనా 'ఆరోగ్య లక్ష్మి' పథకంగా నామకరణంగా మార్చి, అమలు చేస్తున్నారు. ఈ పథకం అమలు క్షేత్రస్థాయిలో అవలుకు నోచుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. సకాలంలో పౌష్టికా హారం అందడంలేదని, పథకం అమలు నీరుగారుతుందని ప్రజలు విమర్శి స్తున్నారు.

పౌష్టికాహారం లోపంతో ఇబ్బందులు..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందకపోవడంతో రక్తహీనత, బరువు తగ్గుట, ఐరన్ లోపం వంటి అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రతీ నెల సకాలంలో పౌష్టికాహారం సరఫరా చేసి అనారోగ్య సమస్యలు లేకుండా చూడాల్సిన అవసరం ఉన్నది.



నర్సింహులపేటలో అంగన్‌వాడీ కేంద్రం(ఇన్‌సెట్)లో సరఫరా చేస్తున్న గుడ్లు

క్షేత్రస్థాయిలో సరుకులు అందేలా చర్యలు

ఎల్లమ్మ, సీడీపీవో, మరిపెడ

ఆరోగ్యలక్ష్మి పథకంలో అంగన్‌వాడీ సెంటర్లకు ప్రభుత్వం నుంచి ఏడు రకాల సరుకులు సరఫరా చేయడం జరుగుతున్నది. ప్రీస్కూల్ పిల్లలకు మాత్రమే స్నాక్స్ సరఫరా చేస్తున్నారు. ప్రతీ రెండు మాసాలకు ఒకసారి నూనె, పప్పులు అందుతున్నాయి. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అన్ని సెంటర్లకు అన్ని రకాల సరుకులు అందేలా చర్యలు తీసుకుంటాం.

విద్యా రంగానికి 15శాతం

బడ్జెట్ కేటాయించాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి

భూపాలపల్లిటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగానికి 15శాతం బడ్జెట్ కేటాయించి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నక్క తిరుపతి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం 15 శాతం నిధులు కేటాయించాలని అన్నారు. క్రమంగా దీనిని 20 శాతానికి పెంచాలని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక కేంద్రీకరణ జరగాలని అన్నారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించి ప్రతి తరగతికీ ఒక టీచర్ ఉండేలా తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను సమాంతరంగా నిర్వహించాలని అన్నారు. అలాగే పాఠశాలల పర్యవేక్షణ వ్యవస్థ పటిష్ఠం చేయాలన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. పెండింగ్ బిల్లులు, పేరుకుపోయిన నాలుగు వాయిదాల డీఏను వెంటనే చెల్లించాలని అన్నారు. వేసవిలో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త కుమారస్వామి, నాయకులు రాజేందర్, తోట రమ, తిరుపతయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి

డోర్నకల్‌లో ఆగిన వలసకూలీ గుండె

అదిలాబాద్ నుంచి ఖమ్మం జిల్లా గూడూరుపాడుకు వస్తుండగా ఘటన

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం వెళ్తున్నవలస కూలీ గుండె ఆగిన ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ రైల్వేస్టేషన్ వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే. ఆదిలాబాద్ జిల్లా మసాలకిదబ్బగూడెంకు చెందిన మడాయి సుపరి (28) తన భార్య భీమాభాయితో పాటు ఏడాదిన్నర కుమార్తెతో కలిసి ఖమ్మం జిల్లాలోని రూరల్ మండలంలోని గూడూరుపాడులో మిర్చితోటలు ఏరేందుకు ఆదిలాబాద్ నుంచి కృష్ణ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. గూడూరుపాడుకు వెళ్లేందుకు రైలు డోర్నకల్ స్టేషన్‌లో ఆగిన తర్వాత రైలుదిగి స్టేషన్ బయటకు వచ్చాడు. అప్పటికే ఒంట్లో ఆలసటగా ఉన్న మడాయి సుపరి తన భార్య, ఎడాదిన్నర చంటిపాపతో కలిసి టికెట్ బుకింగ్ స్థలం వద్ద కూర్చున్నారు. కూర్చున్న వ్యక్తి కూర్చున్నట్లుగానే ఒక్కసారిగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పక్కనే ఉన్న భార్య భీమాబాయి భర్త మృతిని తట్టుకోలేక గుండెలుపగిలేలా రోదించింది. ఏడాదిన్నర పాప కూడా ఏడుస్తుండడంతో ఈ ఘటన చూసిన పలువురు కంటతడిపెట్టారు. వెంటనే స్థానికులు ఆమె పూర్తి వివరాలు తెలుసుకుని ఖమ్మం రూరల్ మండలం గూడూరుపాడులో ఉన్న వారి బంధువులకు విషయం చెప్పారు. వారు అక్కడ్నుంచి డోర్నకల్ చేరుకుని మృతదేహాన్ని ఓ ప్రైవేట్ వాహనం తీసుకుని ఆదిలాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. గూడూరుపాడుకు చెందిన రైతు కిలారి బాబు మానవత్వంతో స్పందించి సుపరి మృతదేహం తరలించేందుకు వాహనాన్ని ఏర్పాటు చేసి మానవత్వం చాటుకున్నారు.


భర్త మృతదేహం పక్కన చంటిపాపతో కలిసి రోదిస్తున్న భార్య భీమాబాయి

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి

• విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి
• సీఈ జె. నరేష్

తొర్రూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా సీఈ (సూపరిండెంట్ ఇంజనీర్) జె.నరేష్, ట్రాన్స్‌కో (సూపరింటెండెంట్ ఇంజనీర్) సీఈ రవీందర్ అన్నారు. గురువారం రాత్రి పట్టణ కేంద్రంలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు డీఈ కార్యాలయంలో సంబంధిత విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో, ఖరీఫ్ రబీ సీజన్లలో గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయ వినియోగాదరులకు ఎటువంటి అంతరా యాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించడం జరుగుతుందన్నారు. వడ్డె కొత్తపల్లి 220కేవీ, డోర్నకల్ 132కేవీ, పెద్దనాగరం 132కేవీ, సబ్ స్టేషన్లలో పవన్ ట్రాన్స్‌ఫార్మర్‌ల సామర్థ్యం పెంపుతో పాటు 132కేవీ అయ్యగారిపల్లి సబ్‌స్టేషన్ నుంచి డోర్నక ల్, నెల్లికుదుర్ సబ్ స్టేషన్ వరకు డబుల్ సర్క్యూట్ లైన్ ఏర్పాటు, పెద్దనాగరం సబ్‌స్టేషన్ లో అదనపు వీసీబీ ఏర్పాటు చేయాలని ఈ దిశగా అనుమతులు మంజూరు కోసం అంచనాలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమ స్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ అంతరా యం లేకుండా చూడాలని విద్యుత్ సిబ్బందిని కోరారు. వేసవి కాలంలో వినియో గాదారులకు ఉటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుత ందన్నారు. విద్యుత్‌ను ప్రజలువాడకంలో పొదుపు పాటిస్తే విద్యుత్ వనరులను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

విద్యుత్ ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండి, ఇబ్బందులు ఉన్నట్లయితే స్థానిక విద్యుత్ అధికారులను తెలియజేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈలు శ్రీనివాసరావు, మధుసూదన్, విజయ్‌కుమార్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ సీఈ జె.నరేష్

విద్యుత్ అధికారుల పొలంబాట

ములుగు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని బండారుపల్లి గ్రామశివారులో విద్యుత్‌శాఖ అధికారులు గురువారం పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ వేణుగోపాల్ కెపాసిటర్ బిగించడం వల్ల కలిగే లాభాలు, ఎలక్ట్రికల్ పరికరాలకు ఎర్తింగ్ పద్ధతుల వల్ల రక్షణ పొందడం, ఇంట్లోని విద్యుత్ పరికరాలను తడి చేతులతో ముట్టుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం, సెల్ చార్జింగ్ పెడుతూ ఫోన్ మాట్లాడడం వల్ల కలిగే ప్రమాదాలు, వ్యవసాయ బోరు వద్ద ఆటో స్టార్టర్ల వల్ల కలిగే దుష్ప్రభా వాలు, విద్యుత్ సర్వీస్ వైరు నాణ్యత, గృహజ్యోతి వినియోగం, అనధికార గృహ, వ్యవసాయ కనెక్షన్లను క్రమబద్ధీకరించడంపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవిలో భాగంగా లో వోల్టేజీ సమస్యను ఎదుర్కోవడానికి తగిన ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఓవర్‌లోడ్‌తో ఉన్న విద్యుత్ నియంత్రికలను గుర్తించి వాటి స్థానంలో అధిక కెపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చుతున్నామని అన్నారు. ములు గు పరిధిలోని బండారుపల్లి గ్రామంలో 100కేవీఏ, రంగారావ ుపల్లిలో 63కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ఏఈలు బానోత్ రవి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వనదేవతల కానుకలు లెక్కించిన అధికారులు

తాడ్వాయి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలకు భక్తులు 2024-25 సంవత్సరం పాటు సమర్పించిన బంగారం, వెండిని అధికారులు గురువారం లెక్కించారు. వార్షిక సంవత్సరం ముగుస్తుండడంతో పూజారులు సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు సమక్షంలో వనదేవతల గద్దెల పరిసరాల్లోని సమావేశపు గదిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సమ్మక్క తల్లికి 42 గ్రాముల బంగారం, 3కిలోల 110గ్రాముల వెండి, సారలమ్మలకు 14గ్రాముల బంగారం, 2.5కిలోల వెండి సమకూరిందని ఈవో రాజేంద్రం తెలిపారు.


బంగారం, వెండి లెక్కిస్తున్న అధికారులు

పెద్దపులి తిరుగు పయనం

కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ ఫారెస్టు వైపు కదలికలు

ములుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో రెండు రోజులపాటు సంచరించిన పెద్దపు లి తన స్థిర స్థావరం వైపు పయనమైంది. ఉమ్మ డి ఖమ్మం జిల్లాలోని కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ అటవీ ప్రాంతం దిశగా వెళ్తున్నట్లు ఫారెస్టు అధికారులు గుర్తించారు. మంగళవారం రాత్రి భూపాలపల్లి అటవీ ప్రాంతం నుంచి ములుగు జిల్లాలోని తా డ్వాయి మండలం బయ్యక్కపేట, వెంకటాపూర్ మండలంలోని అడవి మీదుగా ములుగు మండల ంలోని సర్వాపూర్ అడవిలోకి ప్రవేశించిన పెద్దపు లి లక్నవరం పరీవాహకంలో సంచరిస్తోంది. ఏడు ట్రాక్ కెమెరాలు, మూడు బృందాలతో అటవీ శాఖ అధికారులు పులి కదలి కలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున పస్రా ఫారెస్ట్ రేంజ్ పరిధి గుండ్లవాగు ప్రాజెక్టు సమీప ంలో పులి సంచరిం చింది. మొక్కజొన్న పంట కాపాలా కోసం వెళ్లిన రైతులు మంచె పైనుంచి పులిని గమనించారు. వారు ఇచ్చిన సమాచారంతో గురువారం ఆ ప్రా ంతానికి వెళ్లిన అటవీ అధికారులు పులి పాదము ద్రలను గుర్తించారు. సమీపంలోని లింగాల అడవి గుండా కిన్నెరసారి వన్యప్రాణి విభాగం వైపు పులి వెళ్తున్నట్లు నిర్ధారించారు. ఆ దారిలోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. మేటింగ్ కోసం సుదూర ప్రయాణం చేస్తున్న పెద్దపులి మళ్లీ తిరిగి వచ్చే అవకాశం ఉందని, దాని కదలికలను ఎప్పటి కప్పుడు పరిశీలిస్తున్నామని ములుగు ఫారెస్ట్ రేంజ్ అధికారి డోలి శంకర్ తెలిపారు.


పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు


అధికారులు గుర్తించిన పెద్దపులి పాదముద్రలు

విలేకరి పేరిట బెదిరిస్తున్న వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

వెంకటాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఓ పీడీఎఫ్ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్నానంటూ 20ఎకరాల ప్రభుత్వభూమిని పట్టా చేయాలని ఒత్తిడి చేస్తున్న వ్యక్తిపై రెవెన్యూ ఉద్యోగులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలానికి చెందిన ఓ విలేకరి వెంకటాపూర్ శివారు లింగాపూర్‌లోని సర్వేనంబర్ 1867/3, 1868లో 20 ఎకరాల 12గుంటల భూమిని తాను గతంలో కొనుగోలు చేశానని, దానికి పట్టా చేయాలని ఫిబ్రవరి 22న తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో రెవెన్యూ సిబ్బంది సర్వేకు వెళ్లగా అది ప్రభుత్వ భూమి అని తేలింది. దీంతో పట్టా చేసేందుకు అధికారులు నిరాకరించారు. అప్పటి నుంచి తమను ఆ వ్యక్తి తీవ్రంగా భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, పట్టా చేసి ఇవ్వాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నాడని తహసీల్దార్ గిరిబాబు, ఆర్ఐ విజేందర్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వన్యప్రాణిని వేటాడిన వ్యక్తి అరెస్టు

ములుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పస్రా అటవీశాఖ రేంజ్ పరిధిలోని బుస్సాపూర్ అడవుల్లో వన్యప్రాణిని వేటాడి చంపిన వ్యక్తిని ములుగు ఫారెస్ట్ రేంజ్ అధికారులు గురువా రం అరెస్టు చేశారు. ములుగు మండలం కన్నాయిగూడెం గ్రామానికి చెందిన ధనసరి సాంబయ్య కణుజును వేటాడి చంపి దాని మాంసాన్ని విక్రయి స్తున్నాడు. ఈవిషయం తెలుసుకున్న ఎఫ్ఆర్‌వో డోలి శంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామానికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. కణుజు చర్మం, కళేబరాన్ని స్వాధీనప రచుకున్నారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద సాంబయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పుష్కరాల పనులు

వేగవంతం చేయాలి

దేవాదాయ శాఖ ఎస్ఈ దుర్గాప్రసాద్


అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న అధికారులు

మహదేవపూర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో దేవాదాయ శాఖ ఎస్ఈ దుర్గాప్రసాద్, స్థపతి డీఈ రమేష్ గురువారం సందర్శించారు. పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. పుష్కరాల కోసం ప్రభుత్వం రూ. 25 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ. 5 కోట్ల పనులు జరుగుతున్నాయి. వాటిని ఎస్ఈ దుర్గాప్రసాద్ పరిశీలించారు. పుష్కర ఘాట్ల వద్ద ఏర్పాటు చేసే సరస్వతి విగ్రహ ఏర్పాటును పరిశీలించారు. మెట్ల వద్ద పనులు నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. అలాగే గోదావరి పరిసరాలను, కాళేశ్వరాలయ శివారులో పనులను పరిశీలించారు. పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వారి వెంట ఆలయ ఈవో మహేష్, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మేడారం అభివృద్ధికి

మాస్టర్‌ప్లాన్ రూపకల్పన

- పర్యటించిన కన్సల్టెన్సీ సిబ్బంది


గద్దెల పరిసరాల్లో మాస్టర్ ప్లాన్‌కు నివేదిక కోసం చర్చించుకుంటున్న ప్రత్యేక బృందం

తాడ్వాయి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మల దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపకల్పన కోసం హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం గురువారం మేడారంలో పర్యటించి ఈ సందర్భంగా గద్దెల పరిసరాలు, ప్రాంగణాన్ని పరిశీలించారు. దేవాలయం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రంను కావల్సిన ఏర్పాటు, పనులు, మహా జాతరలో వచ్చే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకొని పూలు పండ్లు పసుపు కుంకుమ చీరె సారులు, కొబ్బరికాయలు బెల్లం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ అధికారులు, సిబ్బంది, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2150	1521
పల్లికాయ (సూక)	5500	5200
పల్లికాయ (పచ్చిది)	4300	2400
కందులు	6921	3022
పెసళ్లు	7251	3022
పత్తి	7010	5300
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13000	9500
డిడి	-	-
వండర్‌హాట్	14200	12000
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	12000	9000
దేశీ	28500	18000
సింగిల్‌పట్టి	29000	20000
దీపిక	13000	10000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

గడబిడల గులాబీ

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాయకుల ఆధిపత్య పోరు
- పార్టీలో నిర్ణయాలపై పట్టుకోసం ఎత్తుకు పైఎత్తులు
- వర్ధన్నపేటపై మాజీ మంత్రి ఎర్రబెల్లి కన్ను
- 'స్టేషన్'లో ఉప ఎన్నికలకు ఇప్పటి నుంచే కార్యాచరణ
- భూపాలపల్లిలో సిరికొండపై గండ్ర గరం గరం
- నేతల సమన్వయ లోపంపై అధిష్ఠానం అసంతృప్తి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

గులాబీ నేతలకు నియోజకవర్గాల పునర్విభజన గుబులు పట్టుకుంది. ఎక్కడ తమ సీటుకు ఎసరు వస్తుందో అని ముందే పొరుగు నియోజకవర్గాలపై కర్చీఫ్ వేసే పనిలో పడ్డారు. ప్రధానంగా వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్‌పై ముగ్గురు కీలక నేతలు ఇన్‌చార్జ్ బాధ్యతలపై కన్నేయడం హాట్‌టాపిక్‌గా మారింది. మరోవైపు స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నికలు వస్తాయని భావిస్తున్న బీఆర్ఎస్.. అక్కడ నుంచి బీజేపీలో చేరిన అరూరి రమేష్‌ను తిరిగి పార్టీలో చేర్చుకోవాలని ఓ వర్గం ఒత్తిడి తెస్తోందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. మరోవైపు భూపాలపల్లి నియోజకవర్గంలోనూ మాజీ స్పీకర్ సిరికొండ పర్యటనలు మాజీ ఎమ్మెల్యే గండ్రకు చిరాకు తెప్పిస్తున్నట్లు తెలుస్తోంది. నేతల మధ్య ఆధిపత్య పోరుతో పార్టీ రజతోత్సవ సభవేదికను పూర్వ కరీంనగర్ పరిధిలోని ఎల్కతుర్తికి మార్చి ఓరుగల్లు నేతలకు భారీ ఝలక్ ఇచ్చారనే చర్చ జరుగుతోంది.

వర్ధన్నపేట లడాయి

బీఆర్ఎస్ ముఖ్యనేతల చూపంతా వర్ధన్నపేట నియోజకవర్గంపైనే ఉంది. వచ్చే ఎన్నికల్లో పోటీ కోసం ఇప్పుడే గ్రౌండ్ రెడీ చేసుకునేందుకు ఆరాట పడుతున్నారు. 2008లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో వర్ధన్నపేట స్థానం ఎస్సీ రిజర్వుడు స్థానంగా మారింది. అప్పటికే 1994, 1999, 2004లో వరుసగా మూడు పర్యాయాలు ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎమ్మెల్యేగా గెలిచారు. 2008 ఎన్నికల్లో ఎస్సీ రిజర్వుడు కావటంతో కొత్తగాఏర్పడిన పాలకుర్తి నుంచి ఎర్రబెల్లి పోటీకి దిగారు. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ 2026లో ప్రారంభం కానుంది. దీంతో ఈసారి వర్ధన్నపేట తిరిగి జనరల్ స్థానంగా మారుతుందనే అంచనాలతో ఉన్న బీఆర్ఎస్ నేతలు.. కర్చీఫ్ వేసే పనిలో పడ్డారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీజేపీలో చేరటంతో బీఆర్ఎస్‌కు ఏడాది కాలంగా జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట నియోజకవర్గానికి ఇన్‌చార్జ్ లేరు. దీంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన పాత స్థానంపై గురిపెట్టి కేడర్ పార్టీ మారకుండా పర్యటనలు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తాను వర్ధన్నపేట నుంచే పోటీ చేస్తానని ఎర్రబెల్లి ఇప్పటికే కేడర్‌కు పలు సభల్లో చెప్పుతూ వస్తున్నారు. అయితే పాలకుర్తి నుంచి తన సతీమణి ఉషాదయాకర్‌రావును బరిలో దించేందుకు ఎర్రబెల్లి కసరత్తు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఏడాది కాలంగా రెండు నియోజకవర్గాల్లో దయాకర్‌రావు పర్యటిస్తూ రెండు చోట్ల పోటీ చేస్తానని కార్యకర్తలకు చెప్పడం వెనుక ఇదే వ్యూహమని తెలుస్తోంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో పట్టు సాధించాలనే పట్టుదలతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు. దీంతో వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి ఓడిన ఏనుగుల రాకేష్‌రెడ్డికి ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా సమాచారం. అయితే పల్లా ప్రతిపాదనపై పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అభ్యంతరం చెప్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. బీజేపీ నుంచి పార్టీలో చేరిన వ్యక్తికి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎలా ఇస్తారని? స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి వర్ధన్నపేట బాధ్యతలు అప్పగించాలని ప్రతిపాదించినట్లుగా సమాచారం. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ టికెట్ కోసం శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. అయితే కేసీఆర్ పల్లా వైపు మొగ్గుచూపటంతో చివరి నిమిషంలో పోచంపల్లికి ఎమ్మెల్యేగా పోటీచేసే చాన్స్ దూరమైంది. దీంతో వర్ధన్నపేట బాధ్యతలు అప్పగించాలని వినయ్‌భాస్కర్ కోరుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నుంచే మొదలైన పల్లా, దాస్యం మధ్య ఆధిపత్య పోరు.. ఇప్పటికే వర్ధన్నపేటపై కన్నేసిన ఎర్రబెల్లికి సంకటంగా మారిందనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి సొంత ప్రాంతం కావటంతో పాటు మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన ఎర్రబెల్లికే వర్ధన్నపేటలో గట్టి పట్టుందని, నేతల మధ్య ఆధిపత్య పోరుతో దయాకర్‌రావు సైలెంట్ అయ్యారని సమాచారం.

అక్కడ.. ఆధిపత్యమే..

అధికారం కోల్పోయి కొంత అసంతృప్తిలో ఉన్న గులాబీ నేతలకు ఆధిపత్య పోరు సెగ తప్పటం లేదు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గత ఏడాది కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే సుప్రీంకోర్టు తీర్పుతో రేపోమాపో శ్రీహరిపై అనర్హత వేటు పడుతుందని బీఆర్ఎస్ నేతలు ఎదురుచూస్తున్నారు. ఈసారి కడియంపై ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్న గులాబీ నేతలు పార్టీ నుంచి అలిగి బయటకు వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యను లోక్‌సభ ఎన్నికల ముందు పార్టీలో చేర్చుకున్నారు. ఉప ఎన్నికలు వస్తే స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్ రాజయ్యకే అని గులాబీ బాస్ భరోసా కూడా ఇచ్చారు. అయితే ఇటీవల కాలంలో కొంతమంది నేతలు బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను తిరిగి కారు ఎక్కించాలని ఆరాటపడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఉప ఎన్నిక వస్తే అరూరిని బరిలో దించాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారని సమాచారం. గులాబీ బాస్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవటంతో నాలుగైదు నెలలుగా అరూరి చేరిక పెండింగ్‌లో పడిందని తెలుస్తోంది. ఇక భూపాలపల్లి నియోజకవర్గంలోనూ గులాబీలో లడాయి ఆగటం లేదు. 2014 ఎన్నికల్లో భూపాలపల్లి నుంచి గెలిచిన సిరికొండ మధుసూదనచారి తొలి స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఆ తరువాత 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భూపాలపల్లి నుంచి కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన గండ్ర వెంకటరమణారెడ్డి బీఆర్ఎస్ గూటికి చేరారు. దీంతో అప్పటి నుంచి సిరికొండ వర్సెస్ గండ్రగా భూపాలపల్లిలో రాజకీయాలు మొదలయ్యాయి. అయితే మధుసూదనచారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన అధిష్ఠానం.. 2023లో తిరిగి గండ్రకే ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో గండ్ర ఓడిపోవటం.. సిరికొండ ప్రొటోకాల్ నియోజకవర్గంగా భూపాలపల్లిని ఎంచుకున్నారు. శాసనమండలిలో విపక్ష నేతగా కూడా ఉన్న మధుసూదనచారి తరుచుగా భూపాలపల్లి నియోజకవర్గంలో పర్యటించటం గండ్రకు చిరాకుగా మారిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.

ఓరుగల్లు నేతలకు కేసీఆర్ ఝలక్

ఉమ్మడి వరంగల్ జిల్లాను బీఆర్ఎస్‌కు గట్టి పట్టున్నదిగా భావించిన కేసీఆర్.. పార్టీ 25ఏళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకలు వరంగల్‌లో నిర్వహించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అయితే సభాస్థలిని ఎంపిక చేయటం నుంచే నేతల మధ్య సమన్వయం కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రొటోకాల్ ప్రకారం తనకు దక్కాల్సిన ప్రాధాన్యత దక్కటం లేదని ఒకరిద్దరు నేతలు అధిష్ఠానం వద్ద ఫిర్యాదు చేశారని సమాచారం. దీంతో ఆతిథ్యం ఇచ్చే జిల్లాలో నేతల మధ్య సమన్వయం లేకపోతే సభ సక్సెస్ కాదని భావించిన కేసీఆర్.. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఘట్‌కేసర్ వద్ద నిర్వహించేందుకు ప్లాన్ చేశారని ప్రచారం జరిగింది. అయితే ఉద్యమ జిల్లాను విస్మరిస్తే భవిష్యత్తులో రాజకీయ ఇబ్బందులు వస్తాయని భావించి.. హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చిన పాత కరీంనగర్ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తి మండల కేంద్రంలో సభ నిర్వహించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా పాత కరీంనగర్ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కు సభ నిర్వహణ బాధ్యతలు అప్పగించటంతో ఓరుగల్లు నేతలకు కేసీఆర్ ఝలక్ ఇచ్చారనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేటలో నీటి ట్యాంకు ద్వారా మామిడి చెట్లకు నీరందిస్తున్న రైతు తీగల ఎల్లయ్య



దమ్మన్నపేటలో పొట్టకొచ్చిన వరి పంట ఎండిపోవడంతో కొడవలితో పశువుల మేతకు కోస్తున్న రైతు నాగరబోయిన రాజెల్లు

ఒకరిది ఆశ.. మరొకరిది నిరాశ..

- పంటను కాపాడుకునేందుకు ఓ రైతు భగీరథ యత్నం
- ఎండిన పంటను మేతగా వేస్తున్న మరో రైతు

వర్ధన్నపేట రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఈ ఇద్దరు రైతుల్లో ఒకరిది ఆశ అయితే.. మరొకరిది నిరాశ. ఒకరు ఎండుతున్న పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తుంటే.. మరొకరు కన్నీటిని దిగమింగి ఎండిన పంటను పశువులకు మేతగా మార్చిన దృశ్యం. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల ఆవేదనను బుధవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది. తమకు తలాపున ఉప్పుగల్లు రిజర్వాయర్, దేవాదుల ఎత్తిపోతల నుంచి నీరొచ్చే సదుపాయాలున్నా, ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధుల పట్టింపులేక కరువు కాలంలో ఇలాంటి దుస్థితి ఏర్పడుతోందని కన్నీటి పర్యంతమవుతున్నారు. దమ్మన్నపేటకు చెందిన తీగల ఎల్లయ్య అనే రైతు తన మూడెకరాల మామిడి తోటను కాపాడుకునేందుకు పక్కనే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న దివిటిపల్లి గ్రామం నుంచి నీటిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నాడు. ఒక్కో ట్యాంకర్ నీరు రూ.1500 అవుతుండగా.. రోజుకు నాలుగైదు ట్యాంకర్ల నీటిని తీసుకువచ్చి మామిడి చెట్లకు పెడుతున్నాడు. ఇప్పటికే నీరు లేక 20 చెట్లు ఎండిపోగా మిగిలిన చెట్లను కాపాడుకోవాలన్న తాపత్రయంతో తాను ఈ భగీరథ ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. సమీపంలోనే మరో రైతు నాగరబోయిన రాజెల్లు తనకు రెండకరాల్లో వరి పంట వేయగా అది పొట్టదశలో ఉన్న క్రమంలోనే ఎకరం పూర్తిగా ఎండిపోయింది. దీంతో ఆ పంటను వదిలేయలేయకుండా కనీసం పశువులకు మేతగా అయినా ఉపయోగించుకోవాలన్న యోచనతో రోజుకు కొంత మేర కొడవలితో కోసి తీసుకెళ్తున్నాడు. కొద్దిరోజులుగా భూగర్భ జలాలు తీవ్రంగా పడిపోవడంతో నీరు లేక పంటలు ఎండుతున్నాయని ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి రాకపోగా, అప్పులకు వడ్డీలు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదంటున్నారు.

దేవాదుల కాలువ లేకనే ఈ దుస్థితి..

తీగల ఎల్లయ్య, రైతు దమ్మన్నపేట

గ్రామానికి చెరువు నీరే ఆధారం. భూగర్భ జలాలు మెండుగా ఉండాలంటే చెరువులో నీరుండాలి. సాగు నీటికి పూర్తిగా బోరు బావుల పైనే ఆధారపడి ఉన్నాం. కానీ ఈ సారి భూగర్భజలాలు భారీ స్థాయిలో పడిపోవడంతో చెరువు పక్కనే ఉండే బోర్లు కూడా పోయడం లేదు. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. దేవాదుల కాలువ మా గ్రామానికి లేదు. ఎన్నో సార్లు ఈ సమస్యను ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం ఎలాంటి ప్రయోజనం లేదు. కళ్లెదుట పంటలు ఎండిపోతుంటే బాధగా ఉంది.

ఎట్టకేలకు దేవాదుల మోటార్లు ప్రారంభం

- దేవన్నపేట ఫేజ్-3 పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేసిన మంత్రులు
- పాల్గొన్న ఉత్తమ్, పొంగులేటి, ఎమ్మెల్యేలు కడియం, నాగరాజు, యశస్విని

హనుమకొండ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు దేవాదుల ఫేజ్-3 పంప్‌హౌస్ మోటార్లు ప్రారంభమయ్యాయి. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని దేవన్నపేట ఫేజ్-3 పంప్‌హౌస్ మోటార్లను గురువారం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ఆన్ చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా దేవన్నపేటకు సాయంత్రం 4 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి మంత్రులకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి పంప్‌హౌస్ వద్దకు చేరుకొని పంప్‌హౌస్ వద్ద రిబ్బన్ కట్ చేసి మోటార్లను ఆన్‌చేశారు.

ఈ సందర్భంగా మెగా కంపెనీ ఇంజనీర్లు, నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి మోటార్ల సామర్థ్యం నీటి విడుదలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మోటార్లను 15 నుంచి 20 రోజుల వరకు నిరంతరంగా నడపాలని అధికారులకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ధర్మ సాగర్ నుంచి జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ పరిధిలో నిపంటలకు సాగునీరు అందించాలని కోరారు. మరో మోటారు వారం రోజుల తర్వాత ఆన్ చేస్తామని, ఆస్ట్రియా నుంచి వచ్చిన ముగ్గురు ఆన్‌రీజ్ కంపెనీ నిపుణులు మోటార్ల పర్యవేక్షణ జరుపుతున్నట్లు అధికారులు మంత్రులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.





దేవన్నపేట పంప్‌హౌస్ వద్ద మోటార్లను ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మోటార్ల పనితీరును పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, మేయర్

అరగంట పాటు హైరానా

రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా దేవన్నపేటలో దిగిన కొద్ది నిమిషాలకే మోటారు అరగంట పాటు మొరాయించింది. ఎయిర్ వచ్చి ట్రిప్పయి బంద్ అయినట్లు ఇంజనీర్లు మంత్రులకు తెలుపడంతో అరగంట పాటు వేచిచూశారు. టెక్నీషియన్స్ ఎయిర్‌బాల్ సరిచేసి మోటారును సరిచేయడంతో ఊపిరిపీల్చుకున్నారు. దీంతో మంత్రులు మోటారును ఆన్ చేసి తక్షణమే అక్కడి నుంచి ధర్మసాగర్ చెరువు వద్దకు ప్రత్యేక కాన్వాయ్ ద్వారా వెళ్లారు.

పది రోజుల ఉత్కంఠకు తెర

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరందరించేందుకు దేవన్నపేట దేవాదుల పంప్‌హౌస్ మోటారు గురువారం ఆన్ కావడంతో ఇటు నీటిపారుదల శాఖ అధికారులు, మంత్రులు ఊపిరి పీల్చుకున్నారు. పది రోజులుగా మోటార్లు ఆన్ చేయాలని రైతులు, పంటలు ఎండిపోతున్నాయని ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేసిన విషయం తెలిసిందే. కాగా, 50 మంది ఇంజనీర్లు, టెక్నీషియన్లు పనులు పూర్తి చేసి గురువారం తెల్లవారుజామున 3 గంటలకు మోటారును ఆన్ చేసి ట్రయల్ రన్ చేసిన అధికారులు గురువారం సాయంత్రం 5 గంటలకు మంత్రుల చేత ప్రారంభించి నీటిని ధర్మసాగర్ చెరువుకు పంపింగ్ చేయడంతో అధికారులు, మంత్రులు సంతోషం వ్యక్తం చేశారు.

పోలీసుల బందోబస్తు

దేవన్నపేట దేవాదుల ఫేజ్-3 పంప్ హౌస్ వద్ద మంత్రుల పర్యటనలో భాగంగా పోలీసులు భారీగా మోహరించారు. దేవన్నపేట గ్రామ సరిహద్దుల్లో పోలీసులు అడుగడుగునా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరుగకుండా పోలీసు అధికారులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

రైతులతో వాగ్వాదం

దేవన్నపేటలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ స్థలంలో రైతులు మొక్కజొన్న కంకులను ఆరబోశారు. మంత్రుల పర్యటన ఖరారు కావడంతో పోలీసులు, ఇతర అధికారులు హెలిప్యాడ్ వద్దకు చేరుకొని రైతులను మొక్కజొన్న కంకులను తరలించాలని చెప్పడంతో పోలీసులతో రైతులు వాగ్వాదం చేశారు.

డిసెంబర్‌లోగా అన్ని పైపులైన్లు పూర్తి చేస్తాం..

- భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ధర్మసాగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పైపులైన్ల పనులను డిసెంబర్‌లోగా పూర్తిచేస్తామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ధర్మసాగర్ మండలకేంద్రంలోని రిజర్వాయర్‌ను ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు దేవన్నపేట వద్ద నదీజలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. దేవాదుల ఫేజ్-3 పైపులైన్ ద్వారా 600 క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నట్లు తెలిపారు. మరో పదిహేను రోజుల్లో మరో పంప్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. రాజవరంపంపింగ్ స్టేషన్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులకు సంబంధించిన పనులను పూర్తి చేస్తామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు వచ్చే విధంగా ఇరిగేషన్ పాలసీతో ముందుకు వెళ్తున్నామన్నారు. దేవాదుల ప్రాజెక్టు రెండున్నర దశాబ్దాలుగా నిర్మాణంలో ఉందని, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు దేవాదుల ప్రాజెక్టు పనులను పూర్తి చేసి సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లలో దేవాదుల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ దేవాదుల ప్రాజెక్టును ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఫేస్‌త్రీని ప్రారంభించిందన్నారు. మూడో దశ దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించింది పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో ప్రారంభించామన్నారు. ఈ పైపులైన్ ద్వారా 600 క్యూసెక్కుల నీరు ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి వస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాన్ని మరింత సస్యశ్యామలంగా చేస్తామన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు ఫేజ్-3 మోటార్‌ను ప్రారంభించి రబీలో రైతుల పంటలను కాపాడిన మంత్రులకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ రైతుల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, మేయర్ సుధారాణి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డీవో రమేష్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, ప్రసాద్, సమ్మయ్య, రాజిరెడ్డి, యాదగిరి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రదాయిని 'సుర్మా'

- రంజాన్ మాసంలో ఓ పవిత్ర కార్యం నేత్రాలంకరణ
- కోహితూర్ పర్వతం భస్మం చూర్ణమే ఇది



సుర్మా భద్రపరిచే పింగాణీ

సుర్మా అలంకరణలోని నేత్రం

మహబూబాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం సంప్రదాయంలో ఆద్యంతం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే రంజాన్ కఠోర ఉపవాస దీక్షల మాసానికి అనేక ప్రత్యేకతలున్నాయి. ఈనెలలో చిన్నాపెద్దా, ఆడామగా తారతమ్యం లేకుండా అందరూ నిష్ఠగా ఉపవాసాలు చేస్తారు. ఎంత పని ఒత్తిడి ఉన్నా తీరిక చేసుకుని ఐదు పూటల నమాజ్ ఆచరిస్తారు. 30రోజుల పాటు క్రమం తప్పకుండా దివ్యఖురాన్ పఠనం చేస్తారు. వీటన్నింటిని పాటించడానికి ప్రతీ ముస్లిం విధిగా మహ్మద్ ప్రవక్త చూపిన బాటనే అనుసరిస్తారు. వీటికి తోడు ఈ మాసంలో నేత్రాల (కనురెప్ప)కు అలంకరించే 'సుర్మా'కు విశిష్ట ప్రాధాన్యం ఉంది. అందువల్లే ముస్లింలు సుర్మాతో నేత్రాలంకరణకు అధిక ప్రాధాన్యమిస్తారు. రంజాన్ నెలలో దీన్నొక పవిత్ర కార్యంగా పరిగణిస్తారు. అంతేకాదు వైద్య పరంగానూ ఇదొక ఆరోగ్య ప్రదాయినిగా నమ్ముతారు.

కోహితూర్ పర్వతం బూడిదే సుర్మా..

నిత్యం అల్లా నామస్మరణలోనే గడిపే దైవప్రవక్త హజ్రత్ మూసా అలైహిసలాం ఓ రోజు తన ఆధ్యాత్మికతతో మనఅల్లాహ్ ప్రసన్నం పొంది నిష్కలవుతారు. ఇదే విషయాన్ని అయన తన అనుయా యుల వద్ద ప్రస్తావించినప్పుడు కొందరు అల్లా ఎక్కడ ఉన్నారని చూపించమని కోరుతారు. దీంతో దైవప్రవక్త హజ్రత్ మూసా అలైహిసలాం ఈజిప్టు, సిరియా ప్రాంతాలకు చెందిన 70మంది పెద్దలను సమీపంలోని కోహితూర్ పర్వతం వద్దకు తీసుకెళతారు. అక్కడ ఒకసారి అల్లాహ్ నూర్ (కాంతి) ప్రత్యక్షం కావడం చూసి అందరు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారట. సరిగ్గా అప్పుడే కోహితూర్ పర్వతం భస్మమై బూడిద (చూర్ణం)గా మారిందన్న కథనాన్ని ముస్లీంలు విశ్వసిస్తారు. అదే దైవ సంకల్పం కళ్లెదుట సాక్షాత్కరించడంతో తమలోని భక్తి ఉప్పొంగి ఆ చూర్ణాన్ని వారు కళ్లకు అద్దుకున్నారని పేర్కొంటారు. ఆ సమయంలో తమ కళ్లు సుదూరంలోని చీమల కదలికలను సైతం పసిగట్టే స్థాయిలో ప్రకాశవంతం కావడం గమనించి అల్లా కృప వల్లే ఇది సాధ్యపడిందని నమ్మారట. అప్పటి నుంచి కోహితూర్ పర్వతానికి చెందిన రాళ్ల చూర్ణమే క్రమంగా సుర్మాగా రూపాంతరం చెందిందనేది ముస్లింల నమ్మకం.

వైద్య పరిభాషలో ఆరోగ్య ప్రదాయిని..


వైద్య పరిభాషలో ఆరోగ్య ప్రదాయినిగా సుర్మాకు మంచి పేరుంది. నమాజ్ చేయడానికి ముందు వజూ (నీటితో శుభ్రపరిచే కాలకృత్యాలు) ఆచరించాక మహ్మద్ ప్రవక్త కంటికి సుర్మా పెట్టుకునే వారని, రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు కూడా కళ్ల కింద సుర్మా రాసుకుని పడుకునే వారని చెబుతారు. ఇలా చేస్తే కళ్లలోని మలినాలు తొలిగిపోతాయని నమ్మకం. నమాజ్‌కు వెళ్లేటప్పుడు ఇంటి వద్ద సుర్మా పెట్టుకోవడం మరిచిపోతే అలాంటి వారి కోసం మసీదుల్లో సుర్మా, అద్దం అందుబాటులో ఉంటుంది. సుర్మా పెట్టుకుంటే కంటి సమస్యలు రావనేది అనేక మంది ఆచరణాత్మకంగా నిరూపిస్తుండటంతో ముస్లిమేతరుల్లో కూడా కొందరు సుర్మా పెట్టుకుంటా రని, కొందరు మహిళలు కాటుక స్థానం లో సుర్మానే వాడటానికి ఇష్టపడతారట. పండుగపూట ఇంటికొచ్చే బంధుమిత్రులకు సుర్మా పెట్టడం ద్వారా గౌరవించే సాంప్రదా యం ముస్లింలలో కన్పిస్తుంది.

విభిన్న ఆకారాల్లో సుర్మేదాన్లు..

ఫ్యాన్సీ దుకాణాలతో పాటు పలు చోట్ల మసీదుల ఎదుట కూడా వ్యాపారులు సుర్మా విక్రయిస్తుంటారు. ఈ రంజాన్ మాసంలో సుర్మా అమ్మకాలు పెరుగుతాయి. సుర్మా కిలో పొడి ధర రూ.175 నుంచి రూ.450 వరకు ఉంటుంది. వీటిని చిన్న చిన్న సీసాలలో పోసి అమ్ముతుంటారు. ఇవి రూ.10 మొదలు రూ.90వరకు లభ్యమవుతున్నాయి. కంపెనీ పేరు, సుర్మా నాణ్యతను బట్టి వీటి ధరలు నిర్ణయిస్తున్నారు. సుర్మాను భద్రపరుచుకునేందుకు విభిన్న ఆకారాలలో సుర్మేదాన్లు (భరిణెలు) మార్కెట్లో భక్తులను కనువిందు చేస్తున్నాయి. వీటి ధర రూ.50 నుంచి రూ.300 వరకు అందుబాటులో ఉంటుంది.

విశ్వావసు ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించిన సీఎం

- అర్చకుల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ
- అర్చక జాక్ నేత గంగు ఉపేంద్రశర్మ



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

హనుమకొండ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో నూతనంగా ముద్రించిన విశ్వావసు నామ సంవత్సర పంచాంగ డైరీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన చాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు. అర్చక ఉద్యోగ జాక్ నేత గంగు ఉపేంద్రశర్మ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేత కాండూరి కృష్ణమాచారి, కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు, అధ్యక్షుడు భద్రినాథ చార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్ర చంద్రశేఖర్‌శర్మ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండారి జగపతి తదితరులు ముఖ్యమంత్రి చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చక ఉద్యోగ జాక్ పక్షాన గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి ఒక వినతిపత్రం సమర్పించారు. దేవాదాయశాఖలో 577 జీవో విడుదలైన నాటి నుంచి ఉన్న అర్చక ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పెన్షన్, గ్రాట్యూటీ హెల్త్ ఇన్సూరెన్స్ వెల్ఫేర్‌బోర్డు మీటింగ్ నిర్వహించాలని, తద్వారా అర్చకుల సంక్షేమం త్వరితగతిన జరుగుతుందని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు.

సెర్ప్ లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు

● పంచాయతీ రాజ్‌శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్

మహబూబాబాద్, మార్చి27 (ఆంధ్రజ్యోతి) : సెర్ప్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ సూచించారు. సెర్ప్ కార్యక్రమాలపై సీఈవో దివ్యతో కలిసి గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్‌లో సెర్ప్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకేపీ కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించినట్లు చెప్పారు. ప్రస్తుతం 33 శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. జిల్లాలో ఇతర శాఖల ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు చేయలేని పక్షంలో ఆ కేంద్రాలను ఐకేపీలకు బదిలీ చేయాలని చెప్పారు. అదనపు ధాన్యం దిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటు సైతం స్వశక్తి మహిళ సంఘాలచే ప్రారంభించాలని కలెక్టర్లను ఆదేశించారు. నూతనంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలను మహిళ సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించాలన్నారు.

పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమిషన్ మహిళ సంఘాలకు అందడం లేదని, దీనిపై జిల్లాస్థాయిలో కలెక్టర్లు సమీక్షించి పెండింగ్ కమిషన్ చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని లోకేష్‌కుమార్ ఆదేశించారు. దివ్యాంగులకు యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా సమీక్షించి దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. నిర్ధారణ క్యాంపుల నిర్వహణ కోసం అస్పత్రిలో అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలనిఆదేశించారు. కుటుంబంలో వృద్ధాప్యం పింఛన్ పొందుతున్న లబ్ధిదారులుఎవరైనా మృతి చెందితే వారి జీవిత భాగస్వామికి అర్హత ఉంటే వెంటనే పింఛన్‌ను మంజూరు చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలను స్వశక్తి మహిళ సంఘాలతో ట్యాగింగ్ చేసి స్కూల్ యూనిఫాం కుట్టు ప్రక్రియసకాలంలో జరిగేలా చూడాలన్నారు. మహిళ సంఘాల ద్వారా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ముందుగా జిల్లా స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనువైన భూములు గుర్తించాలని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలకేంద్రాల స్థాయిలోనూ పెట్రోల్ బంకుల ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఇందిరా మహిళ శక్తి బజార్ కింద షాపుల ఏర్పాటుకు ప్రతి జిల్లాకు లక్ష్యాన్ని నిర్దేశించడం జరుగుతుందన్నారు. ఇందిరా మహిళ శక్తి బజారులో ప్రజలకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం మాట్లాడుతూ జిల్లాలో సదరం పింఛన్, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, జిల్లా అధికారులు మధుసూదన్‌రాజు, ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, రవీందర్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

నేటి నుంచి కొండలమ్మ జాతర

గార్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కోరిన వారికి కొంగు బంగారంలా.. ఈ ప్రాంత ప్రజలకు ఇలవేల్పు దేవతగా పూజలందుకుంటున్న కొండలమ్మ దేవత జాతర ఉత్సవాలను శుక్రవారం నుంచి వైభవంగా నిర్వహిస్తునట్లు కమిటీ చైర్మన్ బూర్ల మల్లేశ్‌గౌడ్ తెలిపారు. స్థానికంగా గురువారం ఆయన మాట్లాడుతూ కాకతీయుల కాలంలో ప్రతాప రుద్రుడు శిల్ప కళా నైపుణ్యంతో కొండలమ్మ దేవాలన్ని నిర్మాణం చేసినట్లు వివరించారు. ఈ నెల 28న ఎండ్ల బండి ప్రభలు, దేవతా రాధన నిర్వహిస్తారు, 29న పూర్ణ కుంభంతో దేవతారాధన, 30న నైవేద్యం సమర్పణ, 31న భజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాటు పూర్తి చేసింది. జాతర జరిగే వారం రోజుల పాటు కొండలమ్మ దేవత రూపంలో త్రాచు పాములు గుడిచుట్టూ సంచరిస్తూ భక్తులకు దర్శనమిస్తాయి. జాతరలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం నుంచి సూర్యాపేట, వరంగల్, ఖమ్మం, నల్ల గొండ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి వేలాదిగా భక్తులు రానున్నారు.


కొండలమ్మ దేవత

సీతారామ ప్రాజెక్టు డైవర్షన్‌తో 'ఇల్లెందు'కు అన్యాయం

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన సీతారామ ప్రాజెక్టు డైవర్షన్‌తో ఇల్లందు నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య అసెంబ్లీ సాక్షిగా ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కొచ్చన్ అవర్ సమయంలో మాట్లాడిన ఆయన గోదావరి జలాలు మూడు జిల్లాలు విస్తరించివున్న ఇల్లెందు నియోజకవర్గానికి అం దించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. టేకులపల్లి మండలం రోళ్లపాడు గ్రామం వద్ద 6 లక్షల 74 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో 2016లో మాజీ సీఎం కేసీఆర్ సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. కానీ, సింగరేణి మండలం చీమలపాడు టన్నెల్ ద్వారా జూలూరుపాడుకు డైవర్షన్ చేసి నీటిని మళ్లించడంతో ఇల్లందు నియోజకవర్గానికి తీవ్ర అన్యా యం జరుగుతుందని వెల్లడించారు. గోదావరి ప్రవహించే గిరిజన ప్రాంతాలకు ముందుగా నీరు అందించకుండా, నాగార్జునసాగర్ జలాలు పారుతున్న సాగు భూములకే తొలుత గోదావరి జలాలు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినటువంటి ఇల్లెందు నియోజకవర్గంలో గోదావరి జలాలు అం దించేందుకు ప్రాజెక్టు ఎలైన్‌మెంట్ జరిపించి, గిరిజన ప్రాంత రైతాంగం మొత్తం కూడా సాగు నీటి పథకాన్ని అందించాలని అసెంబ్లీలో ప్రస్తావించారు. ప్రజాప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యంలో సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతు సోదరులకు సాగు నీరు అందించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తూ, తన ప్రసంగాన్ని ఎమ్మెల్యే ముగించారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నేతలు

మహబూబాబాద్ రూరల్, మార్చి27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను మానుకోట బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో ఆయనకు మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌కు విన్నవించడం జరిగిందని చెప్పారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దిరాజు రాంచందర్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, చీకటి మహేష్‌గౌడ్, గడ్డం అశోక్, సింగారపు సతీష్, ఓర్సు పద్మావతి, పూర్ణచందర్‌రెడ్డి, పల్లె సందీప్, వెన్నమల్ల సందీప్, సురేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడిగా రాము

నెల్లికుదురు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడిగా ఎర్ర బెల్లిగూడెంకు చెందిన గడ్డల రామును నియమించినట్లు మండల అధ్యక్షుడు పరిపాటి వెంకట్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యలయంలో రాముకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బత్తిని అనిల్, గజ్జి అశోక్, గుండెబోయిన సంతోష్, వెన్నాకుల శ్రీనివాస్, గొట్టిముక్కుల ఆదిరెడ్డి, గాదె మదార్ పాల్గొన్నారు.


రాముకు నియామక పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నారాయణపురం సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

కేసముద్రం, మార్చి27 (ఆంధ్రజ్యోతి) : నారాయణపురంలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి గురువారం పరిశీలించారు. గ్రామంలో పట్టాదారుపాస్‌పుస్తకాల కోసం కొన్నేళ్లుగా రైతులు ఆందోళన చేస్తున్న విషయం విధితమే. ఈ క్రమంలో కొద్దిరోజులుగా ఆరుగురు చొప్పున సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు గ్రామంలోని రైతుల భూములను సర్వే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనేఅదనపు కలెక్టర్ నారాయణపురం, ఆలేరు గ్రామాల సరిహద్దుల్లో భూముల సర్వే ప్రక్రియను పరిశీలించి వివరాలను రైతులను, సర్వే అధికారులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్‌డీవో కృష్ణవేణి, తహసీల్దార్ దామోదర్, ఆర్‌ఐలు ఉన్నారు.

మినీ ఆర్యూబీని త్వరగా ప్రారంభించాలి

కేసముద్రం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలో మినీ ఆర్యూబీని త్వరితగతిన తిరిగి ప్రారంభించాలని కోరుతూ రైల్వే స్టేషన్ మాస్టర్‌కు గురువారం సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆర్యూబీ బంద్ చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పార్టీ మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న తెలిపారు. చాగంటి కిషన్, జల్లె జయరాజు, వేల్పుగొండ సావిత్ర, గుగులోత్ కేశ్యా, సోమారపు ఎల్లయ్య పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

మహబూబాబాద్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి కోసం గత రెండు సంవత్సరాల క్రితం లక్షలాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేసి అప్పులపాలయ్యామని, తమ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ లక్ష్మణ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ పెండింగ్ బిల్లుల మంజూరు కోసం ఛలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారన్న పక్కా సమాచారంతో గురువారం పోలీసులు ఛలో అసెంబ్లీకి వెళ్లకుండ మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బోడ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు తెస్తే వాటికి వడ్డీలు పెరుగుతున్నాయని, బిల్లులు మాత్రంమంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సాయంత్రం సొంతపూచీకత్తుపై మాజీ సర్పంచులను విడుదల చేశారు. అరెస్టైన వారిలో మాజీ సర్పంచులు నంద వీరన్న, వస్రం, షఫీయోద్దీన్, ఆంగోతు కాంతికిషన్‌నాయక్, భూక్య సింధు, మేడి శారదవెంకన్న, సుమన్‌లు ఉన్నారు.

తొర్రూరులో..

● తొర్రూరు, (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ గురువారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శీలం లింగన్న, కడెం యాకయ్య, జాటోత్ శారద రమేష్, సోమయ్య తదితరులు ఉన్నారు.

మురళీనాయక్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

మహబూబాబాద్ టౌన్,మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు మంత్రి పదవీ ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ నేత, బీసీ రాష్ట్ర నాయకులు శంతన్‌రామరాజు ఆకాంక్షించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం శంతన్‌రామరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ చోటు కల్పించాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడు లేని విధంగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన మురళీనాయక్ మంత్రి వర్గంలో చోటు కల్పిస్తే ఆ ప్రాంత విద్య, వైద్యం, వ్యాపారం, పర్యాటకకేంద్ర హబ్‌గా విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన మానుకోటకు మరిన్న నిధులు రావాలని, ఈప్రాంత బడుగు, బలహీనవర్గాలు పురోగతి సాధించాలని వేడుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్మగాని కృష్ణమూర్తి, గుగులోతు రాములునాయక్, సోమారపు వీరస్వామి, సిరిపురం వీరన్న, వెంకట్‌రెడ్డి, గోనె శ్యాం, నరేష్‌రెడ్డి,కోల సత్యం, కొండి సాయికిరణ్, లాలయ్య, మల్లేష్, గుంజే హన్మంతు, గుగులోతు చక్రనారాయణసింగ్ పాల్గొన్నారు.


ముత్యాలమ్మగుడిలో పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శంతన్‌రామరాజు

అంగన్‌వాడీల్లో నాసిరకం గుడ్లు పంపిణీ

డోర్నకల్, మార్చి27 (ఆంధ్రజ్యోతి) : తొడేళ్లగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రం-4 లో నాసిరకం గుడ్లు పంపిణీ చేశారని లబ్దిదారులు గురువారం ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే.. తొడేళ్లగూడెంకు చెందిన సునీతకు ఈ నెల 20న అంగన్‌వాడీ కేంద్రం నుంచి 12 గుడ్లను నిర్వాహకులు పంపిణీ చేశారు. తనకు పంపిణీ చేసిన గుడ్లు ఉడకబెట్టిన తర్వాత చూస్తే అవి కుళ్లిపోయి ఉన్నాయని సునీత డోర్నకల్ సీడీపీవో లక్ష్మికి ఫిర్యాదు చేశారు. వెంటనే అక్కడికి వెళ్లిన సీడీపీవో లక్ష్మి ఆరోజు గుడ్లు తీసుకువెళ్లిన మిగతా లబ్దిదారులను కూడ విచారించగా వారందరు తమకు పంపిణీ చేసిన గుడ్లు మంచిగానే ఉన్నాయని సీడీపీవోకు తెలిపారు. దీంతో సీడీపీవో అంగన్‌వాడీ టీచర్ సలీమను విచారించగా అందరికి ఒకేరోజు గుడ్లు పంపిణీ చేశానని సీడీపీవోకు తెలిపింది. కేవలం సునీతకు పంపిణీ చేసిన 12 గుడ్లు కుళ్లిపోవడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలుపనున్నట్లు సీడీపీవో లక్ష్మి తెలిపారు.


సునీతకు పంపిణీ చేసిన నాసిరకం గుడ్లు ఇవే

'ఒకే దేశం.. ఒకే ఎన్నికతోనే అభివృద్ధి'

కురవి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం-ఒకే ఎన్నిక బీజేపీ నినాదమని.. దీనితోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ క్యాచువల్ శ్యాంసుందర్శర్మ అన్నారు. కురవిలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1984 నుంచి భారతీయ జనతా పార్టీ మేనిఫెస్టోలో దేశమంతా ఒకేసారి ఎన్నికలు జరగాలని పొందుపరిచినట్లు చెప్పారు. ప్రధాని మోదీ దీనిపై కమిటీ ఏర్పాటు చేశారని, ఈ కమిటీకి చైర్మన్‌గా మాజీ రాష్ట్రపతి రాంనాథ్‌కోవింద్‌ను నియమించారని తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 1.35 లక్షల కోట్లు ఖర్చు అయిందన్నారు. ఒకేసారి ఎన్నిక జరగడం వల్ల ఖర్చులు తగ్గి దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలకు అవగాహన కోసం బీజేపీ గ్రామగ్రామాన సమావేశాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొంతం పెంటయ్య, మండల అధ్యక్షులు ఎస్వీఎస్ రాజు, నాయకులు వెంకటేష్, జిన్నె నరేందర్, పి.ప్రభాకర్, కోడి రామకృష్ణ, బాదావత్ మోతీలాల్ పాల్గొన్నారు.

కోర్టును సందర్శించిన జిల్లా ప్రిన్సిపల్ జడ్జి

తొర్రూరు, మార్చి27 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టును గురువారం జిల్లా ప్రిన్సిపల్ జడ్జి రవీంద్ర శర్మ సందర్శించారు. కోర్టు కు సంబంధించిన అంశాలు, ఇతర సౌకర్యాల వివరాలను అడిగి తెలుసు కున్నారు. కోర్టుకు హాజరైన జిల్లా ప్రిన్సిపల్ జడ్జికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరితతో కలిసి కోర్టులో ఉన్న ఖాళీలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నియా మకం కోసం చొరవ చూపాలని వినతిపత్రం అందించారు. బార్ అసోసి యేషన్ జనరల్ సెక్రెటరీ గణపురం రామకృష్ణ, న్యాయవాదులు సైదులు, అశోక్, ప్రవీణ్, కుమార్ తదితరులు ఉన్నారు.

చిన్నగూడూరు ఎస్సైగా ప్రవీణ్

చిన్నగూడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు నూతన ఎస్సైగా గురువారం ప్రవీణ్ బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జిల్లా రఘునాథపల్లిలో విధులు నిర్వహిస్తూ బదిలీపై చిన్నగూడూరు కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఝాన్సీ వెయిటింగ్ లిస్టులో ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రత పరిర క్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, జూదం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రవీణ్

ఘనంగా రాంచరణ్ జన్మదిన వేడుకలు

మహబూబాబాద్ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గ్లోబల్‌స్టార్ రాంచరణ్ పుట్టిన రోజు వేడుకలను రాంచరణ్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు దాసరి రావిష్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాంచరణ్ జన్మదిన కేక్‌ను దాసరి రావిష్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రాంచరణ్ ఫ్యాన్స్ రక్తదానం చేసి అభిమానం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు ఎస్‌డి మునీర్, రాంచరణ్ ఫ్యాన్స్ పాల్గొన్నారు.


జిల్లా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న రాంచరణ్ ఫ్యాన్స్ జిల్లా ప్రెసిడెంట్ దాసరి రావిష్

మరిపెడలో పాస్టర్ల నిరసన

మరిపెడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవ మత గురువు పగడాల ప్రవీణ్ మృతికి గల కారకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మరిపెడ పాస్టర్లు డిమాండ్ చేశారు. గురువారం మరిపెడ మునిసిపాలిటీలోని పలు చర్చిల పాస్టర్లతో పాటు మండలంలోని వివిధ గ్రామాల పాస్టర్లు మరిపెడబంగ్లాలోని విశ్రాంతి భవనం దగ్గర ఎన్‌హెచ్‌ఎ 365పై నిరసన వ్యక్తం చేశారు. దావిద్, దేవరాజ్, దేవా, రాజేశ్, ఉపేందర్, భాస్కర్, రామాచారి, ఉప్పత జాషువా, మహేందర్, విజయ్, జాన్‌పాల్, జోసెఫ్, టైటాన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

తొర్రూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవ సంఘాలు, దైవ సేవకులైన పాస్టర్‌లపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు అరికట్టాలని తొర్రూరు డివిజన్ పాస్టర్‌లు అన్నారు. తొర్రూరులో పాస్టర్‌ల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిలీవర్స్ చర్చ్ ఫాదర్ రెవరెండ్ నిరీక్షణ్‌రావు, బి.కృష్ణమోహన్ మాట్లాడారు. పాస్టర్‌లు జాన్సన్, అబ్రహం, రాజేందర్, శ్రీధర్, డివిజన్‌లోని అన్ని మండలాల పాస్టర్‌లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

మానుకోట, డోర్నకల్ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వాలి

•గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు గుగులోతు కిషన్‌నాయక్

మహబూబాబాద్ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మానుకోట, డోర్నకల్ శాసన సభ్యులకు మంత్రి పదవులు ఇవ్వాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు గుగులోతు కిషన్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణలో దాదాపు 40 లక్షల మంది లంబాడీలు ఉన్నారని, లంబాడీల ఓటు బ్యాంకుతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. మానుకోట, డోర్నకల్ నియోగజకవర్గాల్లో అత్యధికంగా లంబాడ జనాబా ఉన్నారని తెలిపారు. గతంలో జిల్లా నుంచి మంత్రివర్గంలో రెడ్యానాయక్, సత్యవతిరాథోడ్‌లకు పదవులు ఇచ్చారని, కేంద్రమంత్రిగా పోరిక బలరాంనాయక్‌కు మంత్రి పదవి ఇచ్చారని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రంలో మంత్రి వర్గ విస్తరణలో మానుకోట, డోర్నకల్ నియోకవర్గాల నుంచి ఒకరికి మంత్రివర్గంలో చోటుకల్పించి లంబాడీ ఎమ్మెల్యేలకు సముచితస్థానం కల్పించాలన్నారు. ఇద్దరిలో ఏ ఒక్కరికి మంత్రి పదవి ఇవ్వనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపడుతామని కిషన్‌నాయక్ హెచ్చరించారు.

'కరెంట్‌తో చేపల వేట మృత్యువుతో చెలగాటమే'!

నర్సింహులపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆకేరువాగు, చెరువులు, నీటి కుంటల్లో విద్యుత్ షాక్‌తో చేపల వేట మృత్యువుతో చెలగాటమేనని విద్యుత్ ఎస్‌ఈ నరేష్ అన్నారు. గురువారం నర్సింహులపేట మండలంలోని రామన్నగూడెం, కొమ్ములవంచ గ్రామాల్లో సందర్శించారు. ఇటీవల చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయిన పార్వీన్ మోహన్, దుండి ఉప్పలయ్య కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామస్థుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ వైర్లను ఉపయోగించి కరెంట్‌తో చాపల వేటకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. నిబంధనలను అతిక్రమించి విద్యుత్‌ను ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. డీఈ మధుసూదన్, ఏఈ పాండునాయక్, సిబ్బంది ఉన్నారు.


రామన్నగూడెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈ నరేష్, అధికారుల బృందం

ఎస్‌ఎస్‌ఏల క్రమబద్ధీకరణ 'సాకారమయ్యేనా'?!

(5వ పేజీ తరువాయి)

రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాతపడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఏ విధమైన ఎక్స్‌గ్రేషియో, భద్రత లేకపోవడంతో ఇన్సూరెన్స్ కంపెనీల్లో ప్రమాద బీమా పాలసీలు తీసుకుంటటూ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు.

సీఎం ఇచ్చిన హామీపైనే ఆశలు..

గత 2023 సెప్టెంబరులో హన్మకొండలో సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో నిరవధిక సమ్మె చేస్తున్న శిబిరాన్ని టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి సందర్శించారు. ఆనాడు రేవంత్‌రెడ్డి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు పేర్కొంటున్నారు. తాజాగా రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సమగ్ర ఇంటింటికుటుంబ సర్వేను కూడా ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు చేశారని, ప్రభుతం ప్రవేశపెడుతున్న ప్రతీ పథకాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువయ్యేలా ఈ ఉద్యోగులు కృషి చేస్తున్నామని పేర్కొంటున్నారు.

అరకొర వేతనాలతో అవస్థలు..

అరకొర వేతనాలతో బతుకుబండిని ఈడ్చుకొస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు స్వరాష్ట్రం సిద్ధిస్తే బతుకులు బాగుపడతాయని అనుకున్న ఉద్యోగులకు నిరాశే మిగిలింది. రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి, అన్నిశాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామన్న నాటి ఉద్యమ నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ మాటలు సమగ్ర శిక్ష ఉద్యోగుల విషయంలో నీటిమూటలుగానే మిగిలిపోయాయని వాపోతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌ఎస్‌ఏలో నియమించబడిన ఉద్యోగుల్లో ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం గత ఐదేళ్లుగా అన్నివిభాగాల ఉద్యోగులకు నెలకు రూ. 23, 500 వేతనం ఇస్తుండగా, తెలంగాణలో మాత్రం రూ. 20 వేలలోపే ఇవ్వడం విచారకరమని వాపోతున్నారు.

రాష్ట్రంలో 19,500 మంది ఉద్యోగులు..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సర్వశిక్షా అభియాన్ వివిధ విభాగాల్లో సుమారు 19,500 మంది విధులు నిర్వహిస్తున్నారు. 2006 నుంచి 2012 వరకు విద్యాశాఖలో అవసరాలను బట్టి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాల నియామకాలు చేపట్టారు. డివిజన్ స్థాయిలో డివిజన్ లెవల్ మానిటరింగ్ టీం మెంబర్ (డీఎంఎల్‌టీ), మండలస్థాయిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్పీ), ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ (ఐఈఆర్పీ), మెసెంజర్లు మండల విద్యావనరుల (ఎమ్మార్సీ) కేంద్రాలకు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ ప్రభుత్వ పాఠశాలలు, విద్యారంగాభివృద్ధికి కృషి చేస్తున్నారు. వీరితో పాటు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో విధులు నిర్వహిసున్న ప్రత్యేకాధికారులు, సీఆర్టీలు, పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పీటీఐలు అరకొరవేతనాలతో బతుకు బండిని నెట్టుకొస్తున్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల విధులివే..

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం రాష్ట్రప్రభుత్వం, విద్యాశాఖ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు పరుస్తుండటంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫాం, నోట్ పుస్తకాలు పంపిణీ, మధ్యాహ్నభోజనం బియ్యం పాఠశాలలకు చేర్చుట, నిర్వహణ అమలు, రోజు వారీగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, ఆన్‌లైన్‌లో విద్యార్థుల నమోదు, 14 సంవత్సరాల లోపు బడీడు పిల్లను గుర్తించి బడిలో చేర్పించుటంతో పాటు ఉపాధ్యాయులు సెలవులో ఉంటే ఆయా పాఠశాలల నిర్వహణ తదితర విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు ఎప్పుడు ఏ సమాచారం అడిగినా వెంటనే అధికారులకు చేరవేస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం లేదు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును అమలుచేసి క్రమబద్ధీకరించాలని ఈ ఉద్యోగులు కోరుతున్నారు.

ఉద్యోగుల డిమాండ్లు ఇవే..

● సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధీకరించాలి.

● ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని వసతులు కల్పించాలి.

● మరణించిన ఉద్యోగులకు రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి.

మహిళా ఉద్యోగులకు వర్తించే బెనిఫిట్స్ కల్పించాలి..

విజయలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్, కురవి



ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న తమకు ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు కల్పిస్తున్న బెనిఫిట్స్ కల్పించాలి. కాంట్రాక్టు పద్ధతిలో చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న తమకు ప్రభుత్వం అండగా ఉండాలి. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలుచేసి ఆదుకోవాలి.